ఇది కద నిజం

ఆదివారం 07-06-2026

# తాడి చెట్టుపై నుంచి జారి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు





**ఇది కద నిజం న్యూస్ జనగామ/రఘునాథ్ పల్లి జూన్ 06**

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన బుర్ర రమేష్ (42), వెంకటయ్య కుమారుడు, గీత కార్మికుడిగా పనిచేస్తూ శుక్రవారం(05-06-2026)సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో ప్రమాదానికి గురయ్యాడు.స్థానిక సర్పంచ్ బాయి కాని రాజు తెలిపిన వివరాల ప్రకారం, వృత్తిలో భాగంగా తాడి చెట్టుపైకి ఎక్కిన రమేష్ ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు.దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా, పక్కటెముకలు విరిగినట్లు తెలిసింది.ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్థులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, రమేష్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆయనకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.ఈ సందర్భంగా సర్పంచ్ బాయి కాని రాజు మాట్లాడుతూ, గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న రమేష్ కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.అలాగే చికిత్సకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.

# మూడవ వార్డులో పాముల సయ్యాటలు.. భయాందోళనలో కాలనీవాసులు

**ఇది కద నిజం న్యూస్ జనగామ జూన్ 06**



మూడవ వార్డులోని శివారు కాలనీల్లో పాముల సంచారం రోజురోజుకు పెరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇండ్ల మధ్యలోనే పాములు తరచూ కనిపిస్తుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయంతో కాలం గడుపుతున్నారు.కాలనీవాసుల కథనం ప్రకారం, 15 నుంచి 20 సంవత్సరాల క్రితమే ఇక్కడ ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, ఇంటి పన్నులు, గృహ నిర్మాణానికి సంబంధించిన పన్నులను లక్షల రూపాయల మేర చెల్లిస్తున్నప్పటికీ ఇప్పటివరకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండటమే కాకుండా, చెత్తాచెదారం పేరుకుపోయి పాములు, విషపురుగులు విస్తరిస్తున్నాయని తెలిపారు. అదనంగా దోమలు పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మూడవ వార్డుతో పాటు రెండో, నాలుగో వార్డులకు చెందిన శివారు కాలనీల ప్రజలు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు, మురుగు కాలువలు నిర్మించి కాలనీల ప్రజలను పాములు, విషపురుగులు, దుర్గంధం, దోమల బారి నుంచి కాపాడాలని కోరారు.స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## జీవో నెంబర్ 7 రద్దు చేయకుంటే ఉద్యమాలు

## ఉధృతం: గౌడ సంఘం ఉపాధ్యక్షులు ఏకాంతం గౌడ్

**ఇది కద నిజం న్యూస్ పర్వతగిరి/జూన్ 6**



విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు,మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్ డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఒక పత్రికా ప్రకటనలో హెచ్చరించారు.ఎన్నికల ముందు బీసీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని,విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం దుర్మార్గమని మండిపడ్డారు.బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు టీసీలు,మెమోలు ఇవ్వకపోవడంతో పేద,మధ్యతరగతి,బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపి బకాయిల విడుదలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని ప్రశ్నించారు.వేలాది కోట్ల రూపాయలు వివిధ పథకాల పేరుతో ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 7 తో పేద, బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు చదువు అందుబాటులో లేకుండా చేయడమే ప్రభుత్వ విధానంలా ఉందని విమర్శించారు.పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని, బీసీ విద్యార్థి వ్యతిరేక విధానాలను విడనాడి జీవో నెంబర్ 7ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో బీసీ సంఘాలన్నీ సమైక్యమై పోరాటాలను ఉధృతం చేస్తాయని పట్టపురం ఏకాంతం గౌడ్ హెచ్చరించారు.

# పెద్ద పెండ్యాలలో 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' గ్రామసభ

## ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్

**ఇది కద నిజం న్యూస్ హన్మకొండ జూన్ 06**



తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శనివారం ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో ఘనంగా గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గౌరవ అతిథులుగా సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ..సమాజంలో మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.మహిళా రక్షణ కోసం పోలీస్ శాఖ పరంగా తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ఆయన వివరించారు. సమాజంలో మహిళలకు ఎదురయ్యే వివిధ సమస్యలపై అవగాహన కల్పిస్తూ, వేధింపుల నివారణలో 'షీ టీమ్స్' పోషిస్తున్న కీలక పాత్రను, దాని ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. మహిళలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా సమస్యలు వస్తే పోలీసులను ఆశ్రయించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వినూత్న ప్రజా పాలన గ్రామసభ కార్యక్రమంలో ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే. శ్రీధర్ రావు, షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ధర్మసాగర్ ఎస్సై ఎస్.కె. జానీ పాషా పాల్గొన్నారు.అలాగే స్థానిక పెద్ద పెండ్యాల సర్పంచ్ తోట నాగరాజు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, మండల ఎంపీడీవో, పెద్ద పెండ్యాల ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మామునూరును మండలంగా ప్రకటించాలని డిమాండ్

## నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



**వరంగల్, జూన్ 6 (ఇది కద నిజం న్యూస్)**

మామునూరును ప్రత్యేక మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మామునూరు మండల సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ పరిధిలోని ఖిలా వరంగల్ మండలం మామునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా మామునూరు మండల సాధన సమితి అధ్యక్షుడు ఎర్ర విజయ్ కుమార్ మాట్లాడుతూ, వరంగల్ నగరానికి సమీపంలో ఉన్న మామునూరు ప్రాంత ప్రజలు మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో అనేక పరిపాలనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల హోదాకు అవసరమైన అన్ని అర్హతలు, వసతులు, జనాభా ఉన్నప్పటికీ మామునూరుకు ఇంకా మండల హోదా కల్పించకపోవడం అన్యాయమన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి మామునూరును ప్రత్యేక మండలంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల సాధన జరిగే వరకు రిలే నిరాహార దీక్షలతో పాటు వివిధ రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.దీక్షలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సాంబయ్య, నల్లతీగల కోటేశ్వర్, మాచర్ల యాదగిరి, మాదిరెడ్డి పాపిరెడ్డి, బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఎండి జమీరుద్దీన్, మన్నె ఓదేలు, కావటి కుమారస్వామి, మడిపల్లి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.మామునూరుకు మండల హోదా కల్పించాలని స్థానిక ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతూ ఉద్యమంలో భాగస్వామ్యం అవుతున్నారు.



# ఎన్నారై మూరముల్ల హర్షిత్ 25వ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్వీట్ల పంపిణీ

**ఇది కద నిజం న్యూస్ జనగామ, జూన్ 6**



మూడవ వార్డు జీఎంఆర్ కాలనీకి చెందిన మూరముల్ల రాజేంద్రప్రసాద్ పెద్ద కుమారుడు, ప్రస్తుతం కెనడాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు మూరముల్ల హర్షిత్ తన 25వ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హర్షిత్ తల్లి శ్రీదేవి, మామ గణేష్ ఆధ్వర్యంలో మూడవ వార్డు మరియు ఎసిరెడ్డి నగర్‌కు చెందిన ప్రాథమిక పాఠశాలల 30 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులను ఇంటికి ఆహ్వానించి స్వీట్లు, తేనీరు అందించి ఆతిథ్యం ఇచ్చారు.ఈ కార్యక్రమానికి మూడవ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి గోపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో అనుసంధానించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు సమాజ అభ్యున్నతికి దోహదపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేడుకల పేరుతో అధిక వ్యయాలు చేయడం కంటే, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా సమాజానికి ఉపయోగకరమైన సందేశం అందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, మలిపెల వాణి, బిచ్చల కొమురయ్య, మున్సిపల్ జవాన్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ రీఛార్జ్‌లపై మళ్లీ భారం..? త్వరలో టారిఫ్‌ల పెంపుకు సంకేతాలు!

**ఇది కద నిజం న్యూస్ , పర్వతగిరి / జూన్ 6 :**




దేశంలోని కోట్లాది మొబైల్ వినియోగదారులకు మరోసారి షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పెరిగిన రీఛార్జ్ ధరలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు, మరోసారి టెలికాం టారిఫ్‌లు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే 3 నుంచి 6 నెలల్లో మొబైల్ రీఛార్జ్ టారిఫ్‌లు సుమారు 10 శాతం మేర పెరిగే అవకాశం ఉందని యాక్సిస్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు.

సీఎన్‌బీసీ–టీవీ18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగినట్లుగా 15 నుంచి 20 శాతం భారీ పెంపులు ఈసారి అవసరం లేదని, కానీ టెలికాం సంస్థల ఆదాయాన్ని పెంచేందుకు పరిమిత స్థాయిలో ధరల సవరణ జరిగే అవకాశం ఉందని తెలిపారు.

ప్రస్తుతం దేశంలో ప్రధాన టెలికాం కంపెనీలు అయిన రిలయన్స్ జియో , భారతి ఎయిర్టెల్ , వోడాఫోన్ ఐడియా తమ సేవల నాణ్యత, 5+ విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని టారిఫ్‌లను పునఃసమీక్షిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

గత ఏడాది కూడా టెలికాం సంస్థలు రీఛార్జ్ ప్లాన్‌ల ధరలను పెంచడంతో సాధారణ వినియోగదారులపై అదనపు భారం పడింది. ముఖ్యంగా రోజువారీ డేటా వాడే విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఎక్కువగా ప్రభావితమయ్యారు. ఇప్పుడు మరోసారి ధరల పెంపు జరిగితే నెలవారీ మొబైల్ ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే, ఈ పెంపు అన్ని ప్లాన్‌లపై సమానంగా ఉండకపోవచ్చని, ముఖ్యంగా అధిక డేటా వినియోగ ప్లాన్‌లు, అన్‌లిమిటెడ్ కాలింగ్ ప్యాకేజీలపై ఎక్కువ ప్రభావం ఉండే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. 5+ సేవల విస్తరణ నేపథ్యంలో కంపెనీలు పెట్టుబడులను తిరిగి పొందేందుకు టారిఫ్ సవరణలు చేయవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇప్పటివరకు టెలికాం కంపెనీల నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, రాబోయే నెలల్లో మొబైల్ రీఛార్జ్ ఖర్చులు పెరిగే అవకాశాన్ని వినియోగదారులు ముందుగానే అంచనా వేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

